


# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

కర్నూలు నంద్యాల

ఆదివారం| 19 అక్టోబరు 2025

పేజీలు 8




రోడ్డుపాలైన నాణ్యత లేని భోజనం

- ఇక పై మీటింగ్‌లకు పిలవద్దు..
- పొదుపు మహిళల హెచ్చరికలు
- ఒకరికి డబ్బులు ఇచ్చి మరొకరికి ఇవ్వకుండా మీటింగ్‌లకు
- నాసిరకంగా భోజనాలతో కడుపులు మాడ్చారు
- సభా ప్రాంగణం వద్ద ఎవరు పట్టించుకోలేదు
- ఉదయం నుండి పస్తులు పెట్టారు

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** ఎక్కడైనా పబ్లిక్ మీటింగ్‌లు, పొలిటికల్ మీటింగ్‌లకు మమ్మల్ని పిలవద్దు మేము ససేమిరా రాము అంటున్నారు.పొదుపు మహిళలు. ఇలాగే ఉంటే మీ పొదుపులు వద్దు..ఈ వేధింపులు వద్దు..అని మొహంపైనే దుమ్మెత్తిపోశారు. దీనికి కారణం కూడా బలంగానే వినిపిస్తుంది. గురువారం నన్నూరు టోల్‌ప్లాజా సమీపాన రాగమయూరిలో జరిగిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జీఎస్‌టి మహాసభకు కర్నూలు నగరానికి సంబంధించి పొదుపు మహిళలని మెప్మా శాఖ అధికారులు గత వారం నుండి మొబిలిజేషన్ పేరుతో మిగతా 2లో

# పొదుపులు వద్దు.. వేధింపులు వద్దు..



ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు ఉన్న తీరు



ఏసీబీ దాడుల్లో పట్టుబడిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

## ఏసీబీ వలలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

-రూ.13 వేల లంచం పుచ్చుకుంటూ అడ్డం దొరికిన వైనం
-బిల్లు ఫైలు క్లియరెన్స్ కోసం లంచం డిమాండ్
-వల పన్ని ఏఈని పట్టుకున్న ఏసీబీ అధికారులు

**తుగ్గలి, మేజర్ న్యూస్ :** దీపావళికి ముందే తుగ్గలిఎంపీడీవోకార్యాలయంలో అవినీతి బాంబులు పేలాయి. వరుసగా ఎక్కడో ఒకచోట ప్రభుత్వ అధికారులు ఏసీబీకి చిక్కుతున్నా అధికారుల్లో మాత్రం ఎలాంటి మార్పు రావడం లేదు. పత్తికొండ లోని పంచాయతీ రాజ్ సబ్ డివిజన్ కార్యాలయంలో లంచం తీసుకుంటూ ఓ ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రెడ్ హ్యాండెడ్ ఏసీబీ అధికారులకు దొరికిపోయాడు. ఆర్డబ్ల్యుసిఏఈ నరేష్ తుగ్గలి ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరు గా ప చేస్తున్న ఏఈ నరేష్ రూ.13 వేల లంచం పుచ్చుకుంటూ ఏసీ అధికారులకు పట్టుబడ్డాడు. ఎస్సీ కాలనీకి గ్రావెల్ రోడ్ బిల్లుల ఫైల్ క్లియరెన్ కోసం తుగ్గలి గ్రామానికి చెందిన ఎంపిటిసి రాజు ను ఆర్డబ్ల్యూఎస్ ఏఈ



వలపన్ని ఏఈని పట్టుకున్న ఏసీబీ అధికారులు

నరేష్ యం బుక్ రికార్డు చేయాలంటే రూ 13వేలు డబ్బు ఇవ్వాల్సిందే అని డిమాండ్ చేశాడు. అంత ఇచ్చుకోలేనని చెప్పినప్పటికీ వినిపించుకోకుండా డబ్బులు ఇస్తేనే రికార్డు నమోదు చేస్తానని చెప్పాడు. ఆర్డబ్ల్యూఎస్ ఏఈ .రోడ్డు వర్క్ చేసి ఏడాదై గా ఎం బుక్ రికార్డు చేయక న్యాయబద్ధంగా చేయాల్సిన మిగతా 2లో

ఆడపిల్లలకు చదువుకునే హక్కు

## ప్రతి ఒక్కరూ కల్పించాలి

- సమాజంలో ఆడ,మగ అనే వివక్ష ఉండకూడదు
- కర్నూలు కలెక్టర్ డాక్టర్.ఏ.సిరి

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** ఆడపిల్లలకు చదువుకునే హక్కు కచ్చితంగా ప్రతిఒక్కరూ కల్పించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ సిరి అన్నారు. శనివారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆద్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ మిగతా 2లో



మాట్లాడుతున్న డాక్టర్ ఏ సిరి

## రూ.75 లక్షలతో పట్టణ అభివృద్ధికి భూమిపూజలు



అభివృద్ధి పనుల్లో భాగంగా ప్లాన్‌ను పరిశీలిస్తున్న మంత్రి ఫరూక్

- భూమిపూజలు చేసి పనులు ప్రారంభించిన మంత్రి ఫరూక్

**నంద్యాల కల్చరల్, మేజర్ న్యూస్ :** నంద్యాల పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని అందులో భాగంగా శనివారం నందమూరినగర్, వైయస్సార్ నగర్, ఆటోనగర్ ప్రాంతాల్లో మొత్తం రూ.75లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎండి ఫరూక్ భూమిపూజ చేశారు. ఈసందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. పట్టణంలోని మూడు ముఖ్యమైన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం, మరమ్మతులపై ప్రత్యేక దృష్టి సాధించామన్నారు. కుందూ బ్రిడ్జి నుంచి పెట్రోల్ బంకు వరకు ప్యాచింగ్ పనులకు రూ.20లక్షలు, వైయస్సార్ మిగతా 2లో

## కార్తీక మాసంలో నిరంతర దర్శనం

- భక్తుల ప్రత్యేక వసతులు
- నవంబరు 18న లక్ష బిల్వార్చన,19న లక్ష కుంకుమార్చన
- ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది పుణ్య క్షేత్రంలో ఈనెల 22వ తేదీ నుంచి నవంబర్ 20వ తేదీ వరకు జరిగే కార్తీక మాసంలో స్వామివార్ల దర్శనాన్ని నిరంతరంగా కల్పిస్తున్నట్లు ఈవో నల్లకాల్వ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం దేవస్థానం కార్యాలయంలో పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక మాసంలో తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ముఖ్య దినాలు అయిన 4 ఆదివారాలు, 4 సోమవారాలలో తెల్లవారు జామున 3 గంటల నుంచి 4.30 గంటల వరకు స్థానిక పూజలు నిర్వహించి, 4.30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిరంతరం దర్శనం కల్పిస్తున్నామని అన్నారు. మిగతా దినాలలో కూడా రాత్రి 10 గంటల వరకు నిరంతర దర్శనం ఉంటుందని అన్నారు.స్వామివార్ల అభిషేకాలు, భక్తుల రద్దీని బట్టి సామూహికంగానూ, గర్భాలయంలోనూ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. మిగతా 2లో



మాట్లాడుతున్న ఈవో శ్రీనివాసరెడ్డి,ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డిలు

## బాణాసంచా దుకాణాలు ఏర్పాటు



2లో

ఎస్‌టిబిసి మైదానంలో వెలసిన బాణాసంచా దుకాణాల దృశ్యం

G. PULLA REDDY ENGINEERING COLLEGE (Autonomous) : KURNOOL–518007
Ph : 08518-271017, 270957 Estd : 1985
Affiliated to J.N.T. University Anantapur, Ananthapuramu

Admission Notification for the Academic Year 2025-26
For Category-B – Management Quota Seats
in I B.Tech. : CIVIL, EEE, ME, ECE, CSE & CSM

Applications are invited for admission into I B.Tech under Category-B (Management quota – Non - NRI seats) from the eligible candidates. Application form and other details will be available in College office from 19.10.2025.

Filled in applications along with the copies of relevant certificates may be submitted in the college office in person between 9.30 A.M. and 4.30 P.M. on all working days on or before 23.10.2025.
- SECRETARY

# ఏసీబీ వలలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

(మొదటి పేజి తరువాయి)

పని అనవసర తత్సరం చేస్తూ వేధించినట్లు తెలుస్తోంది. దీంతో విసిగిపో యిన బాధితుడు ఆర్డబ్ల్యూ ఎస్ ఏఈకి డబ్బులు ఇవ్వడం ఇష్టం లేక ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. శనివారం పక్క ప్లాన్ ప్రకారం ముందుగానే ఎంపీటీసీ రాజుకు ఏసీబీ అధికారులు కరెన్సీ నోట్లకు రసాయనాలు పూసి బాధితుడు చేతికి ఇచ్చారు.ఆ కరెన్సీనోటను తీసుకెళ్లి బాధితుడు ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నరేష్ కు అందజేశారు. వెంటనే ఏసీబీ డీఎస్పీ కృష్ణారెడ్డి బృందం, ఏఈ నరేష్ ఏసీబీ అధికారులకు అడ్డంగా చిక్కాడు.అనంతరం పట్టుబడిన అవినీతి అధికారిపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.విషయం స్థానికంగా పెద్ద సంచలనం అయ్యింది.. లంచాలకు రుచి మరిగిన అవినీతి అధికారుల వెన్ను లో వణుకు మొదలయ్యింది.లంచం ఏ ఉద్యోగి డిమాండ్ చేసిన కఠిన చర్యలు తప్పవని ఏసీబీ డిఎస్పి కృష్ణారెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వం అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఇచ్చిన వారిని గోప్యంగా ఉంచుతామని అన్నారు.

# పొదుపులు వద్దు..వేధింపులు వద్దు..

(మొదటి పేజి తరువాయి)

ప్రధాని సభకు ప్రతి ఆర్‌పికి సంబంధించి 150, 200మంది పొదుపు మహిళలు హాజరు కావాలని లేదంటే వారికి సంబంధించిన లోన్లు నిలిపి వేస్తాం అని గ్రూపులో నుండి తీసేస్తాం అని బెదిరించారు. అలాగే ఆర్‌పిలను సైతం తీవ్రంగా ఒత్తిడికి గురి చేశారు. ప్రతి ఆర్‌పికు 2 నుండి 3బస్సులను అనుసంధానించి వారికి సచివాలయ ఉద్యోగులను అటాచ్ చేశారు. వీరితో పాటు రాజకీయ నాయకుల అనుచరుల సభ్యులను బస్సు ఇంచార్జ్‌లుగా నియమించి మొత్తం బాధ్యతలు వారికి అప్పగించారు. వచ్చిన వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం స్నాక్స్, రాత్రికి కూడా భోజనాలు ఇప్పిస్తామని హామీలు గుప్పించారు. బుధవారం రాత్రికి మెప్మా డిపార్ట్‌మెంట్ నుండి ఒక అధికారిక యాప్ కూడా తయారయ్యింది. అందులో బస్ డ్రైవర్ ఎవరు ఏ బస్సు వంటి వివరాలు నమోదు చేయాలి. బుధవారం రాత్రికి నగరంలో ఉన్న ఆర్‌పిలకు సంబంధించిన బస్సులు నగరానికి చేరుకున్నాయి. ఉదయం వార్డు ఇంచార్జ్‌లు, ఆర్‌పిలు, పొదుపు మహిళలతో బస్సులు నింపి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేశారు. ఎక్కడి నుండి బయలుదేరి ఎక్కడ దింపుతోంది..మళ్లీ ఎప్పుడు సభా ప్రాంగణం నుండి బయలుదేరుతుంది..అనే విషయాలను యాప్‌లో పొందుపరిచారు. ఇంతవరకు బాగుంది. ఇక్కడ మెప్మా అధికారులు పొదుపు మహిళలు సమకూర్చడానికి ఎలాగైతే ఆర్‌పిలను వాడుకున్నారో అలాగే వార్డు ఇంచార్జ్‌లకు, కార్పొరేటర్లకు సైతం జనాలను సమకూర్చాలని టార్గెట్‌లను ఇచ్చారు. వార్డుల్లో ఉన్న పొదుపు మహిళలను ఆర్‌పిలు తీసుకెళ్తున్నారు. ఇక మిగిలిన వారిని తరలించడానికి ఒక్కొక్కరికి రూ.500లు నుండి రూ.1000లుగా మాట్లాడుకున్నారు. ఇక ఒకటే వార్డులలో వీధులలో ఉన్న మహిళలకు తెలియకుండా ఉంటుందా ఆ నోట..ఈ నోట..విషయం బయటకు దావలనంలా వ్యాపించి పొదుపు మహిళలు ఆర్‌పిలను వేధించడం మొదలు పెట్టారు. మీటింగ్‌కు వెళ్లే వారికి డబ్బులు పంచుతున్నారు


బస్సు ఇంచార్జ్‌ల కోసం వెతుకుతున్న మహిళలు

మాకు ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో సమస్య తీవ్రంగా మారింది. మాకు డబ్బులు ఎవ్వరు ఇవ్వలేదు మీరు తప్పకుండా మీటింగ్‌కు రావాల్సిందే అదంతా కేవలం కల్పితాలే అన్నా సాక్ష్యాలు చూపించి మరి డబ్బులు పంచిన విషయాలను ఆర్‌పిలకు చెప్పి వేధించడం మొదలు పెట్టారు. కొందరైతే మీకు నాయకులు డబ్బులు ఇచ్చారు మాకు ఇవ్వడం లేదంటూ నిందలు వేయడం మొదలు పెట్టారు. మరికొందరైతే డబ్బులు ఇవ్వకున్నా సరే కనీసం అల్పాహారం పెట్టలేదు, మధ్యాహ్న భోజనం నాణ్యత ఉందా..ఇది మనుషులు తినేలాగా ఉందా..చిన్న చిన్న డబ్బాలలో అన్నం మాత్రమే పెట్టారు అందులోకి కూడా ఏమీ లేదు అని చీవాట్లు పెట్టారు. ఇలా అవమాన పరచడానికి మమ్మల్ని ఇంకోసారి ఎటువంటి కార్యక్రమాలకు పిలవద్దు అని ఖరాఖండిగా ఆర్‌పిలకు అల్టిమేటం జారీ చేశారని స్థానికంగా వార్డు ప్రజలు మాట్లాడుకుంటున్నారు. మొత్తానికి వెట్టి చాకిరి చేయించుకోవడానికి మాత్రమే పొదుపు మహిళలని వాడుకున్నారని, కార్పొరేటర్లు వారికి కావాల్సిన వారిని డబ్బులు పెట్టి పిల్చుకుపోయారని మా విషయంలో ఎందుకు డబ్బులు పంచలేదని బాహాటంగానే చర్చలు చేసుకుంటున్నారు. పొదుపు మహిళలు రోజు కూలీ చేసుకుంటే తప్ప తినలేని పరిస్థితి ఉన్నా ఆర్‌పిల మీద గౌరవంతో వస్తే ఇంతలా అవమానపరుస్తారా..అనిపొదుపు మహిళలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

# కార్తీక మాసంలో నిరంతర దర్శనం

(మొదటి పేజి తరువాయి)

అలాగే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నామని, క్యూలైన్ల వద్ద పాలు, మంచినీరు, బిస్కెట్లు,మజ్జిగ ఉచితంగా అందజేయడం జరుగుతుందని అన్నారు. అలాగే భక్తులకు ఉచిత ప్రసాద వితరణ అందించడం జరుగుతుందని అన్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం 12.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్విరామంగా ఉచిత నిత్యాన్న ప్రసాద వితరణ చేయడం జరుగుతుందని అన్నారు. దేవస్థానం ఆవరణంలో ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. గర్భిణీలకు, వికలాంగులకు, చంటి బిడ్డల తల్లులకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. అనంతరం ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ భక్తుల రద్దీ అనుగుణంగా ప్రత్యేక పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసి వాహనాలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. తమ సిబ్బందితో ఆలయంలో ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్నామని అన్నారు. కార్తీక పౌర్ణమి రోజున భక్తుల రద్దీ ఉన్న సమయాలలో దేవస్థానం ఏర్పాటు చేసిన ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, వాలంటరీలతో సర్వీస్ చేయడం జరుగుతుందని అన్నారు. ఎప్పటికప్పుడు సీసీ కెమోరాల పర్యవేక్షణలో ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తామని అన్నారు.

**లక్ష బిల్వార్చన, కుంకుమార్చన :** కార్తీక మాసం చివరి రోజులైన నవంబరు 18,19వ తేదీలలో లక్ష బిల్వార్చన, కుంకుమార్చన నిర్వహించడం జరుగుతుందని ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత 25 సంవత్సరాలుగా దాతగా వ్యవహరిస్తున్న రామకృష్ణా విద్యా సంస్థల అధినేత డాక్టర్ జి రామకృష్ణారెడ్డి, విజయకుమారి దంపతులు ఈ ఏడాది కూడా దాతలుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. 19న కుంకుమార్చన అనంతరం సాయంత్రం శాంతి కళ్యాణం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో మధు, ఆలయ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య పాల్గొన్నారు.

# ఆడపిల్లలకు చదువుకునే హక్కు ప్రతిఒక్కరూ కల్పించాలి

(మొదటి పేజి తరువాయి)

బాలికా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత బాలికా విద్య ఏ విధంగా ఉంది అనే విషయాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. ఆడ, మగ ఇద్దరూ సమానమేనని ఆడపిల్ల ఎప్పుడు భారం అనుకోకూడదని కలెక్టర్ పేర్కొన్నారు. ఆడపిల్లలను బాగా చదివించడంతో పాటు పౌష్టికాహారం బాగా పెట్టాలని తెలిపారు. ప్రతి ఆడపిల్లకు చదువుకునే హక్కు కచ్చితంగా ఇవ్వాలన్నారు. చదువుకునే ఆడపిల్ల కుటుంబంలో ఉండడం వల్ల కుటుంబం బాగుపడడంతో పాటు సమాజం కూడా బాగుపడుతుందన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి మాట్లాడుతూ విద్యార్థినీలు అందరు బాగా చదువుకుని జీవితంలో రాణించాలన్నారు. విద్యార్థి దశలో ఎక్కువ సమయం చదువు మీద కేటాయించాలన్నారు. కార్యక్రమం అనంతరం నాటకం, డాన్స్ వేసిన చిన్నారులకు కలెక్టర్, ఎమ్మెల్యే బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి విజయ, డిఎంహెచ్ఓ డా. శాంతికళ, సిపిఓ భారతి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ జుబేదాబేగం, సెక్సువలీ హరాస్మెంట్ కమిటీ చైర్ పర్సన్ మాధవి శ్యామల, మహిళా పోలీస్ స్టేషన్ సిఐ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రూ.75లక్షలతో పట్టణ అభివృద్ధికి భూమి పూజలు

(మొదటి పేజి తరువాయి)


పట్టణ అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్

నగర్‌లో రూ.15లక్షల అంచనా వ్యయంతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను, ఆటో నగర్ ప్రాంతంలో రూ.40లక్షల వ్యయంతో గ్రావెల్ రోడ్డు ఏర్పాటుకు భూమి పూజ చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో 38వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి తాటికొండ బుగ్గరాముడు, మహేష్, గోవిందు, సూరి, కామిని మల్లికార్జున, నాగేశ్వరరావు, కమిషన ర్ శేషన్న, ఎంఈ గుర్రప్ప, పిడి వెంకటదాస్, కౌన్సిలర్ శ్యామ్ సుందర్‌లాల్, లీగల్‌సెల్ జిల్లా మాజీ అధ్యక్షులు బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

# బాణాసంచా దుకాణాలు ఏర్పాటు



**కర్నూలు (కెఎంసి), మేజర్‌న్యూస్ :** దీపావళి పండుగ సందర్భంగా నగరంలో వెలసిన బాణాసంచా దుకాణాలు. దీపావళి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలో 18వ తే దీ నుండి 21వరకు నాలుగు రోజుల పాటు ఎస్‌టిబిసి కాలేజీ మైదానంలో 100బాణాసంచా దుకాణాలను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ఉండేందుకు ఫైర్ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు గట్టి బందోబస్తు చర్యలు తీసుకున్నారు. ఆ ప్రాంతంలో బాణాసంచా నిర్వాహకులు అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ఉండేందుకు ప్రతి షాపు ముందు ఇసుక, నీరు దగ్గరలో ఉంచుకోవాలని పోలీసులు దుకాణదారులకు సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు నిబంధనలు అతిక్రమించకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా బాణాసంచా దుకాణాల అసోసియేషన్ నాయకులు సందీప్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు దుకాణాలు ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. దుకాణ ఏర్పాటుకు రూ.20వేలు, కమర్షియల్ ట్యాక్స్ ఆద్వర్యంలో జీఎస్‌టి కింద రూ. 20వేలు, కార్పొరేషన్‌కు ట్రేడ్ లైసెన్స్ కింద రూ.4వేలు చొప్పున ప్రతి షాప్‌కు నిర్ణయించడం జరిగిందని సందీప్ తెలిపారు. ప్రజలు విరివిరిగా దుకాణాల వద్దకు వచ్చి తమకు కావాల్సిన బాణాలను తీసుకొని వెళ్లవచ్చని ప్రజలకు అందుబాటులోనే ధరలు ఉంచామని తెలిపారు. స్టాల్స్ యజమానులు మాత్రం దూరం దూరంగా షాపులు వేయడం వలన వర్షం వస్తే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని బాణాసంచా తడిసిపోయే ప్రమాదం ఉందని వాపోతున్నారు. దుకాణాల పైకప్పులు వర్షం కారకుండా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# ప్రభుత్వ పాఠశాలకు టేబుల్స్, కుర్చీలు విరాళం

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :**

మండల పరిధిలోని కొంతలపాడు గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు గ్రామ పెద్దలు సీనయ్య, వెంకటేశ్వర్లు, మధులు పాఠశాల అభివృద్ధి కోసం ఆఫీస్ టేబుల్స్, కుర్చీలు విరాళం అందచేసినట్లు మండల విద్యా శాఖ అధికారి ఓంకార్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలను ఎంఈఓ, పాఠశాల హెచ్ఎం నాగరాజు, ఉపాధ్యాయులు సన్మానించారు. అలాగే మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు దాతలు విరాళాలను అందచేసి పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు.

# ఆరోగ్యానికి స్వచ్ఛమైన గాలి అవసరం

**చాగలమర్రి, మేజర్ న్యూస్** :ఆరోగ్యకరమైన జీవనానికి స్వచ్ఛమైన గాలి చాలా ముఖ్యమని జిల్లా బీసీ సంక్షేమ అధికారి,మండల ప్రత్యేకాధికారి జగ్గయ్యతెలిపారు.మూడవ శనివారం సందర్భంగా చాగలమర్రి పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛమైన గాలి–ఆరోగ్యమైన జీవనంలో భాగంగాపిచ్చి మొక్కలను తొలగించి మొక్కలను నాటారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులచే సైక్లింగ్‌ను ప్రోత్సహించి కాలుష్యాన్ని నివారించాలని,ప్రతి ఒక్కరూ చెట్లను పెంచడం, ఆరోగ్య జీవనశైలి పై అవగాహన కల్పిస్తూ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాహీర్‌హుస్సేన్,తహసీల్దార్ విజయ్‌కుమార్,ఎంఈఓ అనురాధ,పిఆర్ ఏఈ కొండారెడ్డి, హెచ్‌ఎం జీవయ్య, ఈఓ


సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తారకేశ్వరీ,ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుశీల,ఏపిఎం నాగమ్మ,ఎంసీఓ రాజ్‌కుమార్,మండల పరిషత్ ,గ్రామ పంచాయతీ, సచివాలయాల సిబ్బంది,పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

# కోటి సంతకాల ఉద్యమాన్ని విజయవంతం చేయాలి

**కోడుమూరు, మేజర్‌న్యూస్ :** మెడికల్ కాలేజీలు పిపిపి విధానాన్ని వ్యతిరేకిస్తూ వైసిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణ ఉద్యమ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త ఎస్ఈసి సభ్యులు కోట్ల హర్షవర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం వైసిపి కార్యాలయంలో కోడుమూరు, గూడూరు, సి బెళగల్ మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వైసిపి హయాంలో


మాట్లాడుతున్న కోట్ల హర్షవర్ధన్ రెడ్డి

రాష్ట్రవ్యాప్తంగా 17మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని, ఉన్నత ఆశయానికి గండి కొడుతున్న కూటమి సర్కార్ వైఖరికి వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరించి నిలదీస్తామని స్పష్టం చేశారు. వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కోటి సంతకాల సేకరణ ప్రతి గ్రామంలో చేపట్టాలని కోరారు. గూడూరు, సి బెళగ ల్, కోడుమూరు మండలాల నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.

# మెడికల్ కాలేజీలపై వైసిపికి ప్రశ్నించే హక్కు లేదు

**:– ఏపి బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు**

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** మెడికల్ కాలేజీలపై ప్రశ్నించే నైతిక హక్కు వైసిపికి లేదని ఏపి బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు స్పష్టం చేశారు. వైసిపి డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతుందని అందులో భాగంగానే కోటి సంతకాల సేకరణ అంటూ ప్రభుత్వంపై బుర దజల్లే కార్యక్రమానికి తెర లేపిందన్నారు. ఈ మేరకు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి ఆదేశాల మేరకు శనివారం షరీన్ నగర్‌లోని తన కార్యాలయంలో క్లస్టర్ ఇంచార్జ్‌లు ఎన్‌వి రామకృష్ణ, పియు మాదన్న, జనార్ధన్ ఆచారితో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పబ్లిక్ పార్ట్‌నర్ షిప్ ద్వారా మెడికల్ కళాశాలల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. పిపి అంటే అవగాహన లేని వైసిపి విష ప్రచారానికే పరిమితమై ప్రజలను మభ్య పెట్టేందుకు కోటి సంతకాల సేకరణ పేరుతో ప్రభుత్వంపై బురద జల్లుతుందన్నారు. ఏడాదికి యాజమాన్య కోట కింద రూ. 12లక్షలు ఎన్నారై కోట కింద రూ. 20లక్షలు అమ్ముకోవడానికి


మాట్లాడుతున్న బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు

వైసిపి జీఓ ఇచ్చింది నిజమా కాదా అని ప్రశ్నించారు. కోర్సు పూర్తి చేయడానికి రూ.కోటి ఖర్చు అయ్యేలా జీఓ ఇచ్చిన వైసిపి ఇప్పుడు నంగనాచి కబుర్లు చెబుతుందని ఎద్దేవ చేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ నాయకులు శైలజ యాదవ్, ముస్లిం మైనార్టీ అధ్యక్షులు ఎస్ ఫిరోజ్, తెలుగు యువత అధ్యక్షుడు జవ్వాజి గంగాధర్ గౌడ్, రాములమ్మ, పుల్లయ్య గౌడ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**SANTHIRAM ENGINEERING COLLEGE (AUTONOMOUS)**
**NH-40, NANDYAL- 518501, A.P. Ph. 9866308475, 9989129091**

**Admission Notification for I YEAR - MBA & I YEAR MCA for SPOT & Category - B for the Academic Year 2025-26**

Applications are invited from the eligible candidates for admission into the **I Year MBA & I Year MCA** Courses, under Spot & Category – B Seats for the Academic Year 2025-26.
Application form and other guide lines can be obtained from the College Office or download from the College website: www.srecnandyal.edu.in. Filled in applications should reach to the office along with required documents on or before **24.10.2025 @ 5.00 PM.** The eligibility and admissions as per the Govt norms and subject to ratification by the competent authority. - PRINCIPAL

# ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** మంత్రాలయం మండల కేంద్రంలో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం చోటు చేసుకొంది. ఎస్.ఐ తెలిపిన వివరాల మేరకు మంత్రాలయం గ్రామానికి చెందిన బంగి రామాంజనేయులు(43) తన భార్య పిల్లలు లేకపోవడంతో, మానసిక స్థితి సరిగా లేకపోవడంతో మనస్థాపానికి గురై పొలంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని పోస్టు మార్టంకుఎమ్మిగనూరుప్రభుత్వఆసుపత్రికి తరలించారు.

# హమాలీలకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేసిన బి.సి రాజారెడ్డి

**– కీ.శే. బి.సి గుర్రెడ్డి జ్ఞాపకార్థం దుస్తుల పంపిణీ**

**బనగానపల్లెమేజర్,న్యూస్:** బనగానపల్లె పట్టణంలోని హమాలీలకు బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బి.సి రాజారెడ్డి ఉచితంగా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బి.సి రాజారెడ్డి మాట్లాడుతూ తన తండ్రి బి.సి గుర్రెడ్డి 1993లో మరణించారని అప్పటి నుండి ఆయన పేరు మీద ఏదో ఒక సేవా కార్యక్రమం చేయాలని సంకల్పించడం జరిగిందని అందులో భాగంగా 1994 నుండి ఈ సంవత్సరం పేదలకు విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ ఏడాది 70మంది హమాలీలకు 67000రూపాయల విలువ చేసే దుస్తులను పంపిణీ చేశామన్నారు. 1994 నుంచి నేటి వరకు 31 సంవత్సరాలుగా దుస్తుల పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. 1986 నుండి హమాలీలతో మంచి సంబంధాలు ఉన్నాయని వారి కష్టం విలువ తనకు తెలుసన్నారు. అప్పట్లో తనకు సంబంధించిన రాజా అండ్ కో సంస్థలో ఎంతో మంది హమాలీలు పని చేశారని గుర్తు చేశారు. డాక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ కీ.శే బి.సి గుర్రెడ్డి క్రమశిక్షణకు మారు పేరన్నారు. వారితో స్నేహ సంబంధాలు ఉండేవని ఆయన ఎప్పుడూ పేద ప్రజలకు ఏదో సహాయం చేయాలని తపిస్తుండేవారని వారి కళలను వారి కుమారుడు రాజారెడ్డి నెరవేరుస్తుండటం అభినందనీయమని వారు తెలిపారు. భవిష్యత్తులో నిరుపేదల కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఐ.వి పక్కీరారెడ్డి మాట్లాడుతూ బి.సి గుర్రెడ్డితో తనకు మొదటి నుంచి ప్రత్యేక అనుబంధం ఉండేదన్నారు. ఆయన కుమారుడు తనను కుటుంబ పెద్దగా భావిస్తూ సలహాలు సూచనలు తీసుకుంటారని తల్లిదండ్రుల పేరు మీద బి.సి రాజారెడ్డి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారని పేదల కోసం మంచి కార్యక్రమాలు చేయాలని నిత్యం ఆలోచిస్తుంటారని తెలిపారు.


హమాలీలకు దుస్తులు పంపిణీ చేస్తున్న బి.సి రాజారెడ్డి

# సర్వీస్ రిజిస్ట్రర్లు పంపిణీ



**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** కొత్తగా ఉపాధ్యాయ వృత్తిలోచేరిన చాగలమర్రి మండల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు సర్వీస్ రిజిస్టర్లు పంపిణీ చేసినట్టు పిఆర్టియు రాష్ట్ర కౌన్సిలర్ రవీంద్రారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారిని శ్రీమతి అనురాధ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీవయ్య సుబ్బరాయుడు సుధాకర్ గుప్తా కాత్యాయని మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుమౌలాలి ఆంజనేయ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారిమాట్లాడుతూ కొత్తగా ఉపాధ్యాయ వృత్తిలో చేరిన వారు ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు సీనియర్ నాయకులు నారాయణమూర్తి రవి ప్రకాష్ రెడ్డి మహబూబ్ బాషా సుబ్రహ్మణ్యం సురేష్ బాబు దాదా పీరు షరీఫ్ షాకీర్ రామ కృష్ణ శివరామచంద్రన్ దస్తగిరి శివరామకృష్ణ నర్సిరెడ్డి జైలాబుద్ధిన్ వెంకటేశ్వర్ రెడ్డి శ్రీనివాసులు మహేంద్ర,తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ కళాశాలల విశిష్టత విద్యార్థులు తెలుసుకోవాలి

**:– ఫ్రెషర్స్ డే వేడుకల్లో పాల్గొన్న ఎంపి నాగరాజు**

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ కళాశాలల విశిష్టత గురించి ఎంపి బస్తిపాటి నాగరాజు విద్యార్థులకు తెలియజేశారు. శనివారం నగరంలోని టౌన్ మోడల్ ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ఎంపి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి


మాట్లాడుతున్న ఎంపి నాగరాజు

నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ కాలేజీల్లో చదువుకున్న ఎంతోమంది నేడు గొప్ప గొప్ప స్థాయిలో ఉన్నారన్నారు. తాను ప్రభుత్వ కళాశాలలోనే చదువుకుని ఎంపి స్థాయికి వచ్చానన్నారు. ప్రభుత్వ కళాశాలలో చదువుకుంటున్నామని విద్యార్థులు తమను తాము తక్కువగా చూసుకోకూడదని, కష్టపడి చదివి ఉన్నతమైన స్థానాలకు చేరుకోవాలన్నారు. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం అన్ని సౌకర్యాలు లభిస్తున్నాయన్నారు. ఇక రాష్ట్రంలో విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. అనంతరం ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఎంపి బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐఓ లాలెప్ప, కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి, టౌన్ మోడల్ స్కూల్ హెడ్‌మాస్టర్ ప్రసాద్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# 26న రాష్ట్ర స్థాయి డ్రాగన్ బోటు ఎంపిక పోటీలు

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** గార్గేయపురం సిటీ ఫారెస్ట్ చెరువు వద్ద ఈ నెల 26న రాష్ట్ర స్థాయి డ్రాగన్ బోటు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సంఘం కార్యదర్శి మంచికంటి అవినాష్ శెట్టి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీలు సీనియర్ స్త్రీ, పురుషుల విభాగం అండర్–23బాల బాలికల విభాగం, పార విభాగంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు 26న ఉదయం 7గంటలకు ప్రారంభిస్తామని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు డ్రాగన్ బోట్ ఇండియా అండ్ ట్రెడిషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నవంబరు 24నుండి 27వ తేదీ వరకు మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరగబోయే 12వ జాతీయ స్థాయి డ్రాగన్ బోట్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ప్రాతినిథ్యం వహిస్తారని తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు రూ. 100లు ప్రవేశ రుసుంతో నేరుగా హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 8143084479ను సంప్రదించాలన్నారు.

# టపాసుల విక్రయం పై నిబంధనలు తప్పనిసరి

**ఆళ్లగడ్డ మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ పట్టణ శివారులోని హెూల్ సేల్ బాణాసంచా దుకాణాలను దీపావళి పండుగ సందర్భంగా అగ్నిమాపక దళ అధికారి భీముడు నాయక్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా దుకాణంలోని స్టాక్ నిలువలను ఆయన పరిశీలించారు. ఫైర్ సేఫ్టీ నిబంధనలను అతిక్రమించి టపాకాయలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని దుకాణదారులను ఫైర్ ఆఫీసర్ భీముడు నాయక్ హెచ్చరించారు.


తనిఖీ చేస్తున్నదృశ్యం

## అక్రమంగా నిల్వ లేదా విక్రయించినా కఠినచర్యలు..వెల్దుర్తి ఎస్సై అశోక్


మాట్లాడుతున్న ఎస్సై అశోక్

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్:** దీపావళి పండుగను పురస్కరించుకొని ఎవ్వరైనా అనుమతులు లేకుండా టపాసులను నిల్వ ఉంచినా, విక్రయాలు చేసినా అటువంటి వారిపై కఠినచర్యలు తీసుకుంటామని వెల్దుర్తి ఎస్సై అశోక్ శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో ఎవ్వరైనా సరే ప్రభుత్వ అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా అటువంటి వారిపై పేలుడు పదార్థాల చట్టం ఐపిసి సెక్షన్స్ ప్రకారం చర్యలు తప్పవన్నారు. ప్రమాదాలకు తావులేకుండా, సరైన భద్రతా ప్రమాణాలు పాటిస్తూ విక్రయించాలని విక్రయదారులకు ఆదేశించారు. కేటాయించిన ప్రదేశాలలోనే దుకాణాలు ఏర్పాటు చేసుకొని బాణసంచా విక్రయాలు చేయాలన్నారు. చిన్నారులను విక్రయ దుకాణాల్లో అగ్నిమాపక సామాగ్రిని తప్పనిసరిగా సిద్ధం చేసుకోవాలన్నారు. లైసెన్స్ ఉన్న విక్రయదారులు మాత్రమే బాణసంచా అమ్మాలన్నారు. ఎక్కడైనా ప్రమాదం చోటు చేసుకున్నా, అక్రమంగా టపాసులు విక్రయిస్తున్నా వెంటనే ఎస్సై నెంబర్ 9121101118, 112, 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

సూర్య



## ప్రధానమంత్రి మోడీని కలవడం నా పూర్వజన్మ సుకృతం



ప్రధాని నరేంద్ర మోడీతో బోరెడ్డి లక్ష్మిరెడ్డి

**ఆళ్లగడ్డ మేజర్ న్యూస్ :** ప్రధాని నరేంద్ర మోడీని కలవడం నా పూర్వజన్మ సుకృతం గా భావిస్తున్నారని ఆళ్లగడ్డ బిజెపి అసెంబ్లీ కోఆర్డినేటర్ బోరేడ్డిలక్ష్మిరెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రపంచం మెచ్చిన నాయకుడు మన దేశ ప్రధాని మోదీని కలవడం నా జీవితంలో మర్చిపో లేనిది అన్నారు. మోదీన కల్పించే అవకాశం కల్పించిననంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు, రాష్ట్ర పార్టీకి కృతజ్ఞతలు తెలుపుతున్నాను అన్నారు. కర్నూలు బహిరంగ సభలో స్టేజి మీద మోదీ వెనకే తాను కూర్చోవడం చాలా సంతోషకరంగా ఉందని 35 సంవత్సరాలుగా పార్టీకి సేవలందిస్తున్నారని బోరెడి లక్ష్మిరెడ్డి తెలిపారు. నా జీవితాంతం బిజెపి లోనే ఉంటూ పార్టీకి అంకితభావంతో పనిచేస్తానన్నారు.

## విక్రయానికి సిద్ధంగా తితిదే డైరీలు, క్యాలెండర్లు

**:– తితిదే కళ్యాణ మండప మేనేజర్ సి రామ్మోహన్ రెడ్డి**

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** ఎంతో జనాధారణ పొందిన తితిదే పంచాంగం క్యాలెండర్లు, డైరీలు నగరంలోని సి క్యాంపులోని తితిదే కళ్యాణ మండపానికి చేరుకున్నట్లు, కర్నూలు నగరానికి తగినన్ని క్యాలెండర్లు, డైరీలు ప్రజల సౌకర్యార్థం అందుబాటులో ఉంచినట్లు కళ్యాణ మండప మేనేజర్ సి రామ్మోహన్ రెడ్డి తెలిపారు. పెద్ద డైరీ రూ.150లు, చిన్న డైరీ రూ.120లు, 12షీట్స్ క్యాలెండర్ రూ.130లు, తెలుగు పంచాంగం క్యాలెండర్ రూ.30లు, టేబుల్ క్యాలెండర్ రూ.75లు, శ్రీ వెంకటేశ్వర స్వామి చిత్రపటంతో కూడిన క్యాలెండర్ రూ.20లు, శ్రీ వెంకటేశ్వర స్వామి పద్మావతి అమ్మవారు కలిసి ఉన్న క్యాలెండర్ రూ.15లు, ఆరు షీట్స్ ఉన్న డిజిటల్ క్యాలెండర్ రూ.450లు కేవలం క్యాష్ మాత్రమే అనుమతించబడునని తెలిపారు. మరిన్ని వివరాలకు 9154489919ను సంప్రదించాలన్నారు.

## స్వర్ణాంధ్రా - స్వచ్ఛాంధ్రా కార్యక్రమం




ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** ప్రతి నెల 3వ శనివారంనాడు నిర్వహించే స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారంనాడు బనగానపల్లె పట్టణంలో ఎంపిడిఒ బాలాంజనేయులు, ఈ.ఒ సతీష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించడం జరిగింది. అదే విధంగా బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ ఎస్. లలిత ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో కమీషనరేట్ ఆదేశాల మేరకు ప్రతి నెల 3వ శనివారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. అనంతరం కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమం తోపాటు క్లీన్ ఎయిర్ అవగాహన వాటాడన్ నిర్వహించారు. అధ్యాపకులు మరియు విద్యార్థులు కలిసి స్వచ్ఛా వాయువు కోసం ప్రతిజ్ఞ చేశారు. పరిశుభ్రమైన పరికరాలు పచ్చదనం మరియు గాలి కాలుష్య నివారణకు కట్టుబడి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర కోఆర్డినేటర్ కౌసల్యాదేవి, మహమ్మద్ గౌస్, వసుంధరమ్మ, నీతమ్మ, సుధాకర్ రెడ్డి, రవికుమార్, ఆంజనేయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

### పాఠశాల విద్య బలోపేతమే స్కూలు కాంప్లెక్స్ లక్ష్యం-మండల విద్యాధికారి



**సి.బెలగల్ మేజర్ న్యూస్ :** పాఠశాల విద్యా ప్రమాణాలు పెంపొందించడం,పాఠశాల విద్య బలోపేతమే స్కూల్ కాంప్లెక్స్ లక్ష్యమని మండల విద్యాధికారి జ్యోతి అన్నారు. మండలంలో శనివారం సి.బెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల హెచ్ఎం నాగలక్ష్మి ఆధ్వర్యంలో స్కూల్ కాంప్లెక్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి జ్యోతి పాల్గొని కార్యక్రమాన్ని నిర్దేశించి మాట్లాడుతూ పాఠశాల విద్య బలోపేతంపై దృష్టి పెట్టాలని విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాన్ని పెంపొందించాలని పాఠశాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని విద్యార్థుల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంపొందించాలని సూచించారు.సబ్జెక్టు వారిగా బోధన నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని, శాస్త్రీయ విద్యా విధానంపై ఉపాధ్యాయులు చర్చించుకోవాలని,బోధన విధానంలో అనుమానాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని మండల విద్యాధికారిని జ్యోతి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఆయా గ్రామాల పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీలో సచివాలయ అధికారుల నిర్లక్ష్యం



**పత్తికొండ, మేజర్ న్యూస్ :** స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడంలో సచివాలయ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఐ మండల కార్యదర్శి కారుమంచి, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు విమర్శించారు. శనివారం వారు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేయాలని గ్రామ, వార్డు సచివాలయాలకు బాధ్యతలు అప్పగిస్తే సచివాలయ అధికారులు మాత్రం రేషన్ కార్డులకోసం వచ్చే ప్రజలకు డీలర్ల వద్దకెళ్ళి తీసుకోండంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వృద్ధులు, వికలాంగులు రేషన్‌కార్డుల కోసం ఎక్కడికెళ్ళి తీసుకోవాలో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. అనంతరం సీపీఐ నాయకులు తహశీల్దార్ హుసేన్ సాహెబ్‌కు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇళ్ల వద్దకెళ్లి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వెంకటరాముడు, ఖాన్, అల్తాఫ్, నాగేంద్ర, పులికొండ, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సంకల్ప్ ఒలింపియాడ్ స్కూల్ లో ముందస్తు దీపావళి వేడుకలు




**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :** పట్టణంలోని శ్రీసంకల్ప్ ఒలింపియాడ్ స్కూల్‌లో శనివారం ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సంవత్సరం వేడుకల ప్రధాన అంశం పర్యావరణ హిత దీపావళి కాలుష్యం లేకుండా పండుగ గా నిర్వహించారు.. దీని ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యం. ఈ కార్యక్రమానికి స్కూల్ చైర్మన్ సుధాకర్,ఆయన సతీమణి రమ్యా రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. స్కూల్ ఛైర్మెన్ సుధాకర్ సందర్భంగా మాట్లాడుతూ, "దీపావళి పండుగ మనలో ఆనందాన్ని నింపడమే కాకుండా, ప్రకృతిని కాపాడే బాధ్యతను కూడా గుర్తు చేస్తుంది" అని విద్యార్థులను ప్రేరేపించారు. విద్యార్థులు దీపావళి యొక్క విశిష్టతను కథలు,నాటికల ద్వారా చెప్పి,శ్లోకాలు పఠించి, నృత్యాలు మరియు కోలాటాలతో అందరినీ అలరించారు. ప్రధాన ఆకర్షణగా విద్యార్థులు స్వయంగా పర్యావరణ హిత దీపాలను తయా రు చేసి వాటిపై పాఠశాల పేరును అచ్చుపెట్టడం, అలాగే శుభాకాంక్ష కార్డులు తయారు చేయడం జరిగింది. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులతో రంగోలి పోటిలను నిర్వహించారు... యాజమాన్యం ఏర్పాటు చేసిన దీపావళి థీమ్ సెల్ఫీ బోర్డు అందరి దృష్టిని ఆకర్షించింది, విద్యార్థులు ఆనందంగా సెల్ఫీలు తీసుకుంటూ పండుగ వాతావరణాన్ని ఆస్వాదించారు.ప్రిన్సిపాల్ విద్యార్థుల ప్రతిభను ప్రశంసిస్తూ, దీపావళి పండుగను ఆనందంగా, సురక్షితంగా మరియు పర్యావరణ హితంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులకు మిఠాయిలు పంచి, పండుగ ఆనందాన్ని అందరితో పంచుకున్నారు.




## మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తే దాడులు చేస్తారా..?

**మాజీ ఎమ్మెల్యేపై దాడికి యత్నించడం సిగ్గుచేటు**

**పాలన చేతకాకపోతే ప్రజలకు క్షమాపణలు చెప్పి గద్దెదిగండి..**

**దాడులు పునరావృతం అయితే సహించేదిలేదు**

**జిల్లా వైకాపా నాయకులు దేశాయి సమీర్‌కుమార్‌రెడ్డి**



పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న దేశాయి సమీర్‌కుమార్‌రెడ్డి

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్ః** రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకొని మాజీ ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తే వాటిని ప్రైవేటీకరణ చేసేందుకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం పాల్పడటం సిగ్గుచేటని, ప్రజలను పాలించడం చేతకాని పక్షంలో ప్రజలకు క్షమాపణలు చెప్పి గద్దెదిగిపోవడం మంచిదని జిల్లా వైకాపా నాయకులు దేశాయి సమీర్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని స్థానిక వైయస్‌ఆర్‌సిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో జడ్పిటిసి దాదిపోగు సుంకన్న, జిల్లా వైకాపా నాయకులు దేశాయి సమీర్‌కుమార్‌రెడ్డిలు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలంటూ, అందుకు నిరసనగా రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గం నందు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించాలని వైయస్‌ఆర్‌సిపి అధినేత వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపులో భాగంగా 17వ తేది శుక్రవారం సంతకాల సేకరణ కార్యక్రమానికి క్రిష్ణగిరి మండల, చిట్యాల గ్రామానికి వెళ్ళిన మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మమను, క్రిష్ణగిరి ఎంపిపి కె.వెంకటరామిరెడ్డిని గ్రామంలోకి రానివ్వకుండా, ఆమె కాన్వాయ్‌పై దాడిచేయడం, మహిళా నాయకురాలు అని చూడకుండా తెలుగుదేశం పార్టీ నాయకుల సమక్షంలో వారి కార్యకర్తలు దుర్భాషలాడటం సిగ్గుచేటన్నారు. ప్రజలకు మేలు జరిగే ప్రభుత్వ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం తప్పు అని ప్రశ్నించడం నేరమా అని వారు ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలలో పెరుగుతున్న అసనాన్ని తట్టుకోలేక, వైయస్‌ఆర్‌సిపిపై పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక ఇలా మాజీ ఎమ్మెల్యేపై దాడికి పాల్పడం సిగ్గుచేటన్నారు. మరోసారి ఇలాంటి పునరావృతం అయితే భవిష్యత్తులో అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని, దాడులను సహించేదిలేదని, దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి, వారిని చట్టపరంగా చర్యలు తీసుకొని, కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర వైకాపా కార్యదర్శి కొత్తూరు వెంకటేశ్వరరెడ్డి, నాయకులు శరభారెడ్డి, అల్లుగుండు శివరామిరెడ్డి, బింగిదొడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, ఎస్.పేరేముల సర్పంచ్ రాధాకృష్ణారెడ్డి, నరసాపురం కృష్ణారెడ్డి, విక్రమ్‌సింహరెడ్డి, రాధాకృష్ణారెడ్డి, ఎల్లస్వామి, శీను, గోవర్ధనగిరి కేశవ్, సీతారామయ్య, శేఖర్, రంగన్న, ముని, కమలాకర్, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టోల్ ప్లాజా అక్రమ వసూళ్లు నిలిపివేయాలి

**పాములపాడు,మేజర్‌న్యూస్ :** పాములపాడు మండలం రుద్రవరం టోల్ ప్లాజా దగ్గర ప్యాసింజర్ వాహనాల నుంచి అక్రమంగా వసూలు చేస్తున్న వెంటనే నిలిపివేయాలని ఏఐటీయూసీ సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా నాయకులు ప్రతాప్ రామచంద్రుడు మాట్లాడుతూ నేషనల్ హైవే 340 సి నిర్మాణం పూర్తి కాకుండా నే టోలుఎలా వసూలు చేస్తారని ప్రశ్నించారు. టాటా మ్యాజిక్ ప్యాసింజర్ వాహనాలకు టోల్ రుసుములో రాయితీ. మినహాయింపు



ఇవ్వాలని కోరారు. లైఫ్ టాక్స్ ఉన్న వాహనాలకు ఫాస్ట్ ట్రాక్ ఉంటే 120 రూపాయలు లేనివాటికి 240 రూపాయలు వసూలు చేయడం భావ్యం కాదన్నారు. నందికొట్కూరు నుండి ఆత్మకూరు వచ్చే ప్యాసింజర్ వాహనాలకు రాయితీతో కూడిన నెలవారి పాసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు అనంతరం టోల్ ప్లాజా మేనేజర్ ముఖేష్ కు ఏ ఐ టి యు సి నాయకులు వినతి పత్రం సమర్పించారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బాలస్వామి అత్తరు హుస్సేన్ శంషుద్దీన్ అంకన్న ముషీర్ ముస్తాక్ శ్రీనివాసులు నాగరాజు వినాయకుల్లా జయన్న వెంకటేశ్వర గౌడ్ శాలుబాషా పాల్గొన్నారు.

## 74ఏళ్ల మహిళను తిరిగి నడిపించిన వైద్యులు

**:– వెన్నుముకలో దీర్ఘకాలంగా కంప్రెషన్ ఫ్రాక్చర్లు**

**:– కర్నూలు కిమ్స్ ఆసుపత్రిలో చికిత్సతో కోలుకున్న వృద్ధురాలు**

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** గుంతకల్లుకు చెందిన 74ఏళ్ల సాలమ్మ అనే వృద్ధురాలు గత కొన్ని నెలలుగా తీవ్రమైన నడుం నొప్పితో అసలు నడవలేకపోతున్నారు. రెండు కాళ్లలోకి కూడా నొప్పి వ్యాపించడంతో ఐదు నిమిషాల కంటే కూర్చోవడం, నిలబడడం కూడా ఆమెకు కష్టమైపోతోంది. ఎక్కడికైనా వెళ్లాలంటే వీల్ చైర్ వాడక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి స్థితిలో ఆమెను కుటుంబ సభ్యులు కర్నూలు కిమ్స్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆమెను పరీక్షించి శస్త్ర చికిత్స చేసిన కన్సల్టెంట్ స్పైన్ సర్జన్ డా. షేక్ మన్నన్ ఈ కేసుకు సంబంధించి శనివారం వివరాలు తెలిపారు. సాలమ్మకు శస్త్ర చికిత్స చేయడం ద్వారా పరిస్థితి గణనీయంగా మెరుగు పడిందన్నారు. ఆమె ఇప్పుడు దాదాపు గంటకుపైగా చాలా సులభంగా కూర్చోగలుగుతున్నారని, కాళ్ల నొప్పులు కూడా పూర్తిగా తగ్గిపోయాయని లేచి తిరుగుతున్నారన్నారు. అయితే ఆమె ఎముకలు బాగా బలహీనంగా ఉండడంతో రెండునెలల పాటు నడవొద్దని సూచించామన్నారు. అంతవరకు ఆమెకు మందులిచ్చి ఎముకలకు బలం వచ్చేలా చూస్తున్నామన్నారు. కర్నూలు కిమ్స్ ఆసుపత్రిలో ఉన్న అత్యాధునిక సదుపాయాల కారణంగా ఎలాంటి సంక్లిష్టమైన కేసులకైనా ఇక్కడ పూర్తి పరిష్కారం దొరుకుతుందని డాక్టర్ షేక్ మన్నన్ వివరించారు.




వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ షేక్ మన్నన్

# పచ్చని ప్రకృతితోనే పర్యావరణ సమతుల్యత సాధ్యం




గోనెగండ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న డీఎల్పీవో తిమ్మక్క, ఎంపీడీవో, గ్రామ సర్పంచ్, టీడీపీ నాయకులు

**గోనెగండ్ల,మేజర్ న్యూస్ :** పచ్చని ప్రకృతి తోనే పర్యావరణం సమతుల్యత సాధ్యం అవుతుందని డీఎల్పీవో తిమ్మక్క ఎంపీడీవో మణిమంజరి, గ్రామ మేజర్సర్పంచ్ హైమావతి, కార్యదర్శి సతీష్, మండల టీడీపీ కన్వీనర్ తిరుపతయ్యనాయుడు అన్నారు. మండల కేంద్రమైన గోనెగండ్లలో మూడవ శనివారం స్వర్ణఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కింద గ్రామలోని పలు వీధులలో పంచాయతీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్ స్టాండ్ ప్రాంగణం నందు మానవహారం ఏర్పాటు చేశారు. ఉద్యోగులు, విద్యార్థులు, గ్రామ ప్రజలచే ఎంపీడీవో స్వచ్ఛఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రతి రోజు పర్యవరణ పరిశుభ్రత కోసం కొంత సమయంను కేటాయించాలని కోరారు. ప్రకృతి పచ్చదనం ప్రాముఖ్యతను వివరించారు. పాఠశాల ప్రాంగనం లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రామాంజినేయలు, నీలకంఠప్ప, టీడీపీ నాయకులు బేతాల బడేసా, అడ్వకేట్ చం ద్రశేఖర్, మురళినాయుడు, వెంకటేశ్వర్లు, మహల్ రహంతుల్లా, మలాంగ్, సుబాన్, అనిల్, మదీనా, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రీన్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదాం

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** గ్రీన్ ఏపీలో స్ఫూర్తితో ఎమ్మిగనూరును గ్రీన్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దామని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ సిబ్బందితోపాటు విద్యార్థులు, కౌన్సిలర్లు, టిడిపి నాయకులతో కలిసి మున్సిపల్ కార్యాలయం నుండి పెద్ద పార్కు వరకు సైకిల్ ర్యాలీ చేపట్టారు. ఈ మేరకు వారు పార్క్ ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల న్నారు. ప్రతి వార్డును పరిశుభ్రంగా ఉంచుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఆర్వో అస్లాం భాష, ఆర్ఐలు సూరిబాబు, లవ కుమార్, డిఈ నాయక్, శానిటరీ ఇన్స్ పెక్టర్ శ్రీనివాసులు, మెప్మా సీఈఓ జయవర్ధన్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మాచాని మహేష్, టీడీపీ నాయకులు తురేగల్ నజీర్ ఆహమ్మద్, అమానుల్లా, దాదా సాహెబ్, అబ్దుల్లా, ఎన్బీకే ఈరన్న, నాగూర్ బాషా, సచివాల సిబ్బంది మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.




ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం

# జిల్లా ప్రగతికి ఐక్యతతో పోరాడుదాం

**:- కెపియస్ అధినేత ఎం శ్రీహర్ష పిలుపు**




**కర్నూలు (కెఎంసి), మేజర్న్యూస్ :** గొప్ప చరిత్ర ఉన్నప్పటికీ వెనుకబడుతున్న జిల్లా ఉనికి కోసం, దశాబ్దాల సమస్యల పరిష్కారం కోసం ఐక్యమత్యంతో పోరాడుదామని కర్నూలు ప్రగతి సమితి(కెపియస్) వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం శ్రీహర్ష పిలుపునిచ్చారు. శనివారం బిర్లా కాంపౌండ్లోని కెపియస్ కార్యాలయంలో కర్నూలుకు తాగునీరు-రైతులకు సాగునీరు నినాదంతో గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణ ఆవశ్యకతపై శ్రీ హర్ష అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సభ ప్రారంభంలో గుండ్రేవుల ప్రాజెక్టు డిపిఆర్ సిద్ధం చేసి ముఖ్యమంత్రులతో చర్చించిన రిటైర్డ్ సీనియర్ ఇంజనీరింగ్ అధికారి సుబ్బరాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మేధావులు, విద్యార్థి, ప్రజా సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణ అవసరంపై వివరణాత్మక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా శ్రీహర్ష మాట్లాడుతూ పుట్టిన నేలకు రుణం తీర్చుకోవాలని, జరుగుతున్న అన్యాయాలపై పోరాడేందుకు కెపియస్ స్థాపించామన్నారు. గత ఐదేళ్లుగా మావంతుగా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టామని, జిల్లా అన్ని రంగాల్లో ముందుండటమే మా అంతిమ లక్ష్యమన్నారు. సాఫ్ట్వేర్, రియల్ ఎస్టేట్ రంగాల్లో ఎదుగుతున్న శ్రీహర్ష లాంటి వారు పోరాటానికి ముందుకు రావడం శుభపరిణామమని మేధావులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మేధావులు చెన్నయ్య, మన్సూర్, నౌషాద్, విద్యావేత్త పుల్లయ్య, రైతు సంఘం నాయకులు రామకృష్ణారెడ్డి, శేషన్న రెడ్డి, బిజెపి యువజన విభాగం అధ్యక్షుడు సునీల్ రెడ్డి, విద్యార్థి సంఘాల నాయకులు రవి, విహెచ్పి నాయకులు ప్రతాప్ రెడ్డి, లోక్సత్తా పార్టీ దేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం

**సంజామలమేజర్,న్యూస్:** బాలికలు విద్యతోనే దేశ, రాష్ట్ర ప్రగతి సాధ్యమని ఎంపిడిఒ సాల్మన్ అన్నారు. శనివారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ శాంత అధ్యక్షతన బాలికలు, తల్లులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఎంపిడిఒ మాట్లాడుతూ మహిళలు విద్యావంతులైతే ఆ కుటుంబం ఆర్థిక ప్రగతిని సాధిస్తుందన్నారు. ఆడపిల్లలని వివక్షతకు తావు లేకుండా తల్లిదండ్రులు అన్ని రంగాలలో తీర్చిదిద్దాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఎస్.ఐ రమణయ్య మాట్లాడుతూ బాలికలు విద్యతోనే సాధికారత సాధ్యమవుతుందని ఆడపిల్లలు ఉన్నత చదువులు చదివి పురుషులతో సమానంగా రాణించాలన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు, బాలికలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా సత్వర రక్షణకోసం 100, 112 నెంబర్లకు ఫోన్ చేస్తే రక్షణ కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కెజిబివి ప్రిన్సిప్ శ్రీలేఖ, ఎపిఒ రవిప్రకాష్, మహిళా పోలీసు హరిత, అంగన్వాడి కార్యకర్తలు, వర్కర్లు, బాలికలు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ సాల్మన్

కమర్షియల్ టాక్స్ కార్యాలయంలో

# స్వచ్ఛ భారత్

**నంద్యాల నూనెపల్లె, మేజర్న్యూస్ :** నంద్యాల పట్టణంలోని కమర్షియల్ కార్యాలయంలో కమర్షియల్ టాక్స్ అధికారి లక్ష్మి నాయక్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా శనివారం కమర్షియల్ టాక్స్ కార్యాలయంలో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కార్యాలయం పరిసర ప్రాంతంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా లక్ష్మి నాయక్ మాట్లాడుతూ ఆరోగ్యమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ పచ్చదనం కోసం మొక్కలు నాటాలన్నారు. స్వచ్ఛమైన గాలి ఆరోగ్యానికి మెరుగైన జీవితం అన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వాయు కాలుష్యం నివారించవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ కె ఆర్ గ్లోబల్ స్కూల్ లో ఘనంగా ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం



**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :** ఆహా ఏమి రుచిఅనరా మైమరచి..అనే సినిమా పాటను మైమరిపించేలా శనివారం ఎల్ కె ఆర్ గ్లోబల్ స్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు పలు రకాల వంటకాలను తయారు చేసి స్థానిక ప్రదర్శించారు. శనివారం పాఠశాలలోనిర్వహించిన ఈఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమంలో వివిధ రకాల ఆధునిక, సాంప్రదాయ వంటకాలను తయారుచేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా నంద్యాల 2 టౌన్ సిఐ అశ్రర్ భాష మరియు ఎస్సై కృష్ణారెడ్డి,పాఠశాల ప్రిన్సిపల్ కోటి నాగేశ్వరరావు కోఆర్డినేటర్ శ్రీకాంత్, ఏవోరమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కోటి నాగేశ్వరరావు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. జంక్ ఫుడ్ తో పోషకాలున్న ఆహారాన్ని మర్చిపోతున్న ప్రస్తుతతరుణంలో సాంప్రదాయ వంటకాల ప్రాధాన్యతను తెలిపేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందంతో పాటు విద్యార్థులు,సిబ్బంది పాల్గొన్నారు.

# బిసిల కోటా వారికే చెందేలా చట్టం చేయాలి

**:- తెలంగాణలో చేస్తున్న బంద్కు మద్దతు తెలిపిన బిసి, బహుజన సంఘాలు**



మాట్లాడుతున్న నక్కలమిట్ట శ్రీనివాసులు

**కల్లూరు, మేజర్న్యూస్ :** బిసిల కోటా వారికే చెందేలా చట్టం చేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం బిసి రిజర్వేషన్ 42శాతం అమలు కోరుతూ తెలంగాణ రాష్ట్రంలో చేస్తున్న బంద్కు మద్దతుగా బిసి సంఘాలు, బహుజన సంఘాలు నగరంలోని బిర్లాగేట్ వద్ద మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రి భాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తెలంగాణ బంద్కు మద్దతు తెలుపుతూ నినాదాలు చేస్తూ విజయవంతం కావాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 75సం॥లుగా అగ్రవర్ణాలే అన్ని పదవులు అనుభవిస్తూ బిసిలకు తీవ్ర అన్యాయం చేశారని ఇక మీదట అది చెల్లదన్నారు. బిసిల కోటా వారికి చెందే విధంగా చట్టం చేసి 9వ షెడ్యూలులో చేర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బిసిల తడాఖా చూపిస్తామని అగ్రవర్ణ ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ సమావేశంలో బిసి నాయకుడు అన్వర్ హుస్సేన్, బహుజన విద్యావంతుల నాయకులు జెవి కృష్ణయ్య, రామేశేషయ్య, రంగస్వామి, వర్మ, నాగభూషణం, శివశంకర్, మాధవస్వామి, దామోదరం రాధాకృష్ణ, పట్నం రాజేశ్వరి, విజయలక్ష్మి, శేషఫణి, ధనుంజయ ఆచారి, బత్తుల లక్ష్మీ కాంతయ్య, కురువ బలరాం, డేవిడ్, బ్యాంకు రాముడు, సింధు నాగేశ్వరరావు, విద్యార్థి సంఘాల నాయకులు సాయి కుమార్ పాల్గొన్నారు.

# ఉమామహేశ్వరులకు వెండి తీర్థపు గిన్నె విరాళం

**బనగానపల్లెరూరల్మేజర్,న్యూస్:**



యాగంటి శ్రీ ఉమామహేశ్వరస్వామి దేవస్థానం నందు కడప జిల్లా బద్వేల్కు చెందిన పొన్నవోలు గోవర్ధన్ రెడ్డి సాహిత్య రెడ్డి 45వేల విలువ చేసే 240 గ్రాముల వెండి తీర్థపు గిన్నెను విరాళంగా అందజేశారు. ఆలయ అర్చకులు దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

# శ్రీశ్రీశ్రీ గుడికల్ సద్గురు హుసేన్ పీరా స్వాముల ఆరాధనోత్సవాలు

**వెల్దుర్తి, మేజర్న్యూస్:** ఈనెల 20వ తేది నుండి 21వ తేది వరకు రెండు రోజుల పాటు శ్రీశ్రీశ్రీ గుడికల్ సద్గురు హుసేన్ పీరా స్వాముల వారి ఆరాధన మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈనెల 20వ తేది సోమవారం శ్రీసద్గురు హుసేన్పీరా స్వాముల వారికి గంధమహోత్సవం, 21వ తేది మంగళవారం ఆరాధన మహోత్సవాలను శ్రీశ్రీశ్రీ సద్గురు గాజీ హుసేన్పీరా స్వాముల వారి అధ్యక్షతన నిర్వహించేందుకు గ్రామపెద్దలు నిర్ణయించారన్నారు. కావున ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆరాధన మహోత్సవాలలో పాల్గొని స్వాముల వారి ఆశీర్వాదాలు పొందాలన్నారు.

# పోలీస్ స్టేషన్లల్లో స్వచ్ఛ ఆంధ్రా- స్వచ్ఛ దివాస్ కార్యక్రమం



**నంద్యాల నూనెపల్లె, మేజర్న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతి మూడవ శనివారం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఎస్పీ సునీల్ షేరాన్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్లలో నిర్వహించారు. శనివారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు, ఎస్డీపీఓ కార్యాలయం, హెడ్ క్వార్టర్, జిల్లా పోలీస్ కార్యాలయ పరిసరాలు, మోటార్ వెహికల్ విభాగం, రిజర్వ్ ఇన్స్పెక్టర్ కార్యాలయాలు, ఆయుధ విభాగం, కాన్ఫరెన్స్ హాల్, డీసీఆర్బీ, స్పెషల్ బ్రాంచ్, పాస్పోర్ట్ కార్యాలయం, సైబర్ క్రైం కార్యాలయం అన్ని విభాగాలలో గల సిబ్బంది ఈ స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొని పరిసరాలలోని పిచ్చి మొక్కలను తొలగించి, చిన్న చిన్న గుంతలను పూడ్చి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మన ఇళ్లులాగే మన కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఈ స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివస్ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ను పరిశుభ్ర పరచడంలో సహాయ పడుతుందని అన్నారు.

సూర్య



# సర్పంచ్‌కు తెలియకుండానే స్వచ్ఛంధ్రా-స్వర్ణాంధ్రా కార్యక్రమం

**– అధికారుల తీరుపై సర్పంచ్, ఉపసర్పంచ్ నిరసన**

**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన సర్పంచ్, ఉపసర్పంచ్, గ్రామ పాలక మండలికి తెలియకుండానే గ్రామంలో ప్రభుత్వ కార్యక్రమాలు చేపట్టడం ఎంత వరకు సబబని గ్రామ సర్పంచ్ పక్కిరమ్మ, ఉప సర్పంచ్ భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డిలు ఆరోపించారు. ప్రతి మూడవ శనివారం స్వచ్ఛంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టుతుంది. వీటిలో గ్రామ పంచాయతీలను భాగస్వామ్యులను చేస్తూ అధికారులు కార్యక్రమాన్ని చేపట్టాల్సి ఉండగా కొందరు అధికారుల ఏకపక్ష ధోరణితో గ్రామ పంచాయతీ సర్పంచ్, ఉపసర్పంచ్,వార్డుమెంబర్లకు తెలియకుండానే కార్యక్రమాలు చేపడుతూ విమర్శల పాలవుతున్నారు. కోవెలకుంట్ల మండలం బిజినవేముల గ్రామంలో శనివారం డిప్యూటీ ఎంపీడీవో ప్రకాశ్ నాయుడు, మరికొంత మంది పారిశుధ్య కార్మికులను తీసుకెళ్ళి గ్రామంలో ర్యాలీలు, శుభ్రత, పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టారు. అయితే సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు తెలియకుండా చేయడంతో చేపట్టిన పనులకు రూ.15 వేల బిల్లులు చేయాలని ఎంపీడీవో ప్రకాశ్ నాయుడు సర్పంచ్, ఉపసర్పంచ్, పాలక మండలి సభ్యులపై ఒత్తిడి చేస్తున్నాడని సర్పంచ్, ఉపసర్పంచ్ ఆరోపించారు. తమ గ్రామంలో తాము చేపట్టాల్సిన పనులను ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకొని వచ్చి పనులు చేపట్టడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన తమను కాదని బాధ్యతగల అధికారి ఇలా పనులు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఈ విషయంపై సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోవడం జరుగుతుందని సర్పంచ్, ఉపసర్పంచ్‌లు తెలిపారు. ప్రతిపక్ష పార్టీ అయిన వైసీపీ సర్పంచ్‌లపై ఇలా కక్ష సాధింపు ధోరణితో వ్యవహరించడం సరైనది కాదని అన్నారు. సర్పంచ్, అధికారులు కలిసి పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ఇలా పక్షపాత ధోరణితో పని చేస్తే గ్రామాలలో అభివృద్ధి ముందుకు సాగదని అన్నారు.

# పర్యావరణ కాలుష్యాన్ని కాపాడుదాం..డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్

**-కాలుష్యంపై గ్రామంలో సైకిల్ ర్యాలీ -ఇంటింటికి మొక్కలు నాటుదాం**

**మిడుతూరు మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం నిర్వహణకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రతి నెలా మూడో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రతి ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచడమే దీని లక్ష్యం. ఇందులో ప్రతి పౌరుడు భాగస్వామిఅయ్యేలాచూడాల్సిన బాధ్యత అధికారులదే. డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి అన్నారు అనంతరం గ్రామ సర్పంచ్ జయ లక్ష్మమ్మ మరియు ఎంపీడీవో దశరథ రామయ్య ఆధ్వర్యంలో తాహాసిల్దార్ కార్యాలయం నుండి పోలీస్ స్టేషన్ వరకు సైకిల్ పై ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో మనవాహారంగా ఏర్పడి మన భావితరాల కోసం స్వచ్ఛమైన గాలి ఆరోగ్యవంతమైన జీవితం దీని ఉద్దేశం. కాలుష్యం లేని పర్యావరణం, గాలిలో కాలుష్యం లేకుండా చూడాల్సిన బాధ్యత గ్రామంలో ఇంటింటికి మొక్కలను నాటాలని ఎంపీడీవో దశరథ రామయ్య పిలుపునిచ్చారు. అధిక సంఖ్యలో చెట్లను పెంచడం వల్ల కాలుష్యం నివారించవచ్చునని ఆయన అన్నారు.ఎక్కడకు వెళ్లినా ఆహ్లాదకరమైన వాతావరణం ఉండాలనేది ఆశయం. మరియు ప్రతి ఇంటిపై సూర్యకా ఘర్‌నీ వినియోగించుకోవాలని కోరారు ఎస్ టి ఎస్ సి లకు ఉచితంగా సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవాలని కోరారు మిగతా కులాల వారికి 70000 సబ్సిడీతో సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేస్తారని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు అనంతరం గ్రామంలోని ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో ఈ ఓ ఆర్ డి సంజన్న ఏపిఎం సుబ్బయ్య ఏ పీ ఓ నాగమ్మ పంజాబీ కార్యదర్శి కళ్యాణ్ సింగ్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు



సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

# బాలికలు అన్ని రంగాలలో రాణించాలి



విద్యార్థినీలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**కొలిమిగుండ్లమేజర్,న్యూస్ః** బాలికలు అన్ని రంగాలలో రాణించేందుకు పట్టుదలతో కృషి చేయాలని బాలల సంరక్షణ అధికారులు కె. శ్రీనివాస్ మరియు ఎ. దర్గయ్య తెలిపారు. శనివారం కొలిమిగుండ్ల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలను ఉద్దేశించి సంరక్షణ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబరు 11వ తేదీ నుండి వారోత్సవాల్లో భాగంగా అంతర్జాతీయ బాలికల దినోత్వసం జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలల హక్కుల గురించి వివరించారు. అలాగే బాల్య వివాహాల వల్ల కలిగే పర్యవసనాలు గురించి పిల్లలకు వివరించడం జరిగింది. సమాజంలో వచ్చే సమస్యలను ఎలా ఎదుర్కొవాలో వివరించడం జరిగింది. కొలిమిగుండ్ల ఎం.ఈ.ఓ మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాలలో ముందుండాలని సూచించారు. అలాగే కొలిమిగుండ్ల ఎస్.ఐ మాట్లాడుతూ సైబర్ నేరాలపై బాలికల్లో అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అలాగే విద్యార్థులకు వ్యాసరచణ పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కెజిబివి ప్రిన్సిపల్, అంగన్‌వాడి టీచర్స్ మరియు స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

# టపాకాయల వ్యాపారులకు దుకాణాలు కేటాయింపు

**– నంద్యాల తహసీల్దార్ శ్రీనివాసులు**



**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** దీపావళి పండుగ సందర్భంగా టపాకాయల వ్యాపారులకు దుకాణాల కేటాయింపు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. నంద్యాల తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో డ్రా విధానంతో ఎస్పీజీ గ్రౌండ్‌లో మొత్తం 63 మందికి మున్సిపల్ కమీషనర్ బండి శేషన్న ఆధ్వర్యంలో దుకాణాలు కేటాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని అనుమతులు ఉన్న వ్యాపారులకు మాత్రమే దుకాణాలు కేటాయించామని అన్నారు. వ్యాపారులు నియమ నిబంధనలకు తప్పక పాటించాలని అన్నారు. ప్రజలు టపాకాయాలు కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని హెచ్చరించారు. టపాకాయల కొనుగోలు కేంద్రాల వద్దకు చిన్న పిల్లలను తీసుకొని రావద్దని అన్నారు.

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులకు దుస్తులు పంపిణీ



**పాములపాడు,మేజర్‌న్యూస్ :** పాములపాడు జిల్లా పరిషత్ హై స్కూల్ మండల్ లెవెల్ గేమ్స్ సందర్భంగా ప్రతిభ కనబరుస్తున్న 30 మంది క్రీడాకారులకు క్రీడా దుస్తులను శనివారం అందజేశారు. ఈ స్ఫూర్తిదాయక కార్యక్రమానికి ప్రేరణగా నిలిచిన కె. ప్రశాంత్ రాజ్ (కాటంట్రేడర్స్ అధినేత) తమ వ్యక్తిగత శ్రద్ధతో క్రీడాకారులను ప్రోత్సహిస్తూ దుస్తులు అందజేయడం విశేషం. ఈ సందర్భంగా హెడ్ మాస్టర్ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ "ప్రశాంత్ రాజ్ లాంటి స్ఫూర్తిదాయక వ్యక్తులు సమాజానికి ఆభరణం. వారి సహకారంతో క్రీడాకారులు మరింత ఉత్సాహంతో ముందుకు సాగి మండలానికి మంచి పేరు తీసుకురావాలి"అని పేర్కొన్నారు. మండల క్రీడా సమన్వయకర్త రాజశేఖర్ దామరేకుల రవి మరియు శ్రీనివాసులు మాట్లాడుతూ "విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా చురుకుగా పాల్గొనాలి. ఇండోర్ గేమ్స్ ద్వారా మానసిక చురుకుదనం, అవుట్‌డోర్ గేమ్స్ ద్వారా శారీరక దృఢత్వం పెరుగుతాయి. విద్యార్థి దశలో ఆటల ప్రాముఖ్యత అత్యంత కీలకం," అని అన్నారు. "ప్రశాంత్ రాజ్ స్ఫూర్తిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలి. విద్యార్థులు తమ ప్రతిభతో డివిజన్, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పాల్గొని తల్లిదండ్రులకు,పాఠశాలకు, గ్రామానికి గర్వకారణంగా నిలవాలి," అని కూడా వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు స్వామిశేఖర్ , ఉపాధ్యాయ బృందం, క్రీడా అభ్యాసకులు, మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# పరిశుభ్రత మనందరి బాధ్యత..ఎంపిడిఓ శ్రీనివాసరావు



ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు, నాయకులు

**ప్యాపిలి, మేజర్‌న్యూస్ః** ఆరోగ్యంగా, పరిశుభ్రమైన వాతావరణంలో జీవించాలంటే పరిశుభ్రతతోనే సాధ్యమని, మనందరి బాధ్యతగా పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఎంపిడిఓ శ్రీనివాసరావు అన్నారు. స్వర్ణాంధ్ర....స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ప్యాపిలి పట్టణంలో ఎంపిడిఓ శ్రీనివాసరావు, తహశిల్దార్ భారతీల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్యాపిలి పట్టణంలోని బస్టాండ్ వద్ద రహదారిపై మానవహారంగా ఏర్పడి పరిశుభ్రకు కృషి చేస్తామని ప్రజలు, నాయకులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి ఎంపిడిఓ ప్రభాకర్, మేజర్ గ్రామ పంచాయితీ ఈఓ శివకుమార్‌గౌడ్, మాజీ ఎంపిపి తొప్పెల శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, ఏపిఓ రవీంద్ర, కార్యాలయాల సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# మండలంలో స్వర్ణాంధ్రా..స్వచ్ఛాంధ్రా ర్యాలీ

**సి.బెలగల్ మేజర్ న్యూస్ :** మండలంలో శనివారం స్వర్ణాంధ్ర..స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి నెల మూడవ శనివారం స్వర్ణాంధ్ర.. స్వచ్ఛఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం బెలగల్ మండల సచివాలయం-2 పంచాయతీ సెక్రెటరీ శ్యామలమ్మ ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులు సచివాలయ సిబ్బంది ఆశ వర్కరతో కలసి స్వర్ణాంధ్ర..స్వచ్ఛంద కార్యక్రమం నిర్వహించి తద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ర్యాలీని నిర్వహించారు. ఈకార్యక్రమం ద్వార పారిశుద్ధం, పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం,పరిరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఎస్ఓ శ్రీనివాసులు, వివిధ గ్రామాల పంచాయతి సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.




# గుండెపోటుతో వ్యక్తి మృతి



కె.పడిగలన్న(65) (ఫైల్‌ఫోటో)

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్ః** వెల్దుర్తి మేజర్ గ్రామ పంచాయితీ పరిధిలోని 15వ వార్డు కొండపేటకు చెందిన కె.పడిగలన్న(65) అనే వ్యక్తి గుండెపోటుతో మృతి చెందిన ఘటన శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే తెల్లవారుజామున 3ః30 గంటల సమయంలో ఛాతిలో నొప్పి ఉందని కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని వెళ్ళారు. ఆసుపత్రిలో స్టాఫ్‌నర్స్ ప్రథమ చికిత్స చేసి, ఉదయం వైద్యులు అందుబాటులో ఉంటారని వచ్చి వైద్యం చేయించుకోవాలని సూచించారు. ఇంటికి చేరుకున్న తరువాత గుండెనొప్పి ఎంతకీ తగ్గకపోవడంతో ఉదయం వెల్దుర్తిలోని ప్రైవేటుల క్లీనిక్‌కు తీసుకెళ్ళగా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళమనీ తెలిపారు. వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రికు తీసుకొని వెళ్ళగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య గతంలో రోడ్డు ప్రమాదంలో మరణించడం జరిగింది. మృతుడికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

# ఇలా వచ్చారు... అలా వెళ్లారు..

**– ఇది ఆస్పరి మండల సర్వసభ్య సమావేశం**

**ఆస్పరి, మేజర్ న్యూస్ :** మండల సర్వసభ్య సమావేశం గత మూడు నెలలకొక్కసారి నిర్వహించడం ఆనవాయితీ. ఈ సమావేశంలో గ్రామాల్లో నెలకొన్న సమస్యలను మండలంలో నిర్వహించే మండల సమావేశం మినీ మండల అసెంబ్లీ సమావేశంగా, జిల్లాలో జరిగే జిల్లా పరిషత్ సమావేశాన్ని జిల్లా మినీ అసెంబ్లీగా నిర్వహిస్తారు. మండల సర్వసభ్య సమావేశఃలో తీర్మానం చేసి వాటిని పరిష్కరించడానికి ప్రభుత్వ నిధుల కోసం జిల్లా పరిషత్‌లో ఆమోదించడానికి పంపడం జరుగుతుంది. కాగా శనివారం మండల పరిషత్ అధ్యక్షురాలు ఉమాదేవి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటీసీలు పాల్గొనగా, కొందరు మండల అధికారులు మాత్రం సమావేశానికి హాజరయ్యారు. మిగిలిన అధికారులు సమావేశానికి డుమ్మా కొట్టారు. గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామాలన్ని అపరిశుభ్రంగా ఉండగా, పారిశుద్ధ్య పనులపై పాలకులు నిలదీయగా అధికారులు మిన్నుండిపోయారు. కురిసిన వర్షాలకు సైతం ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి, ఉల్లి, కంది, టమోటా, తదితర పంటలు దెబ్బతిన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ విషయాలపై మండల సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులుగాని,అధికారులుగానిపట్టించుకోకపోవడం శోచనీయం. వైద్యం, విద్య, ఐసిడిఎస్, వెలుగు, వ్యవసాయ, రెవిన్యూ తదితర శాఖల అధికారులు వచ్చి వెళ్లారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను, అపరిశుభ్రతను గురించి ప్రసావించకపోవడం గమనార్హం. గంటలోపే సమావేశం ముగించి మమా అనిపించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

# పేకాట రాయుళ్ళు అరెస్టు

**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** కోవెలకుంట్ల మండలంలోని అమడాల గ్రామ శివారుల్లో పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. గ్రామ శివారుల్లోని ముళ్ళ పొదల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు దాడి చేసి 11 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.9500 నగదును, ప్లేకార్డులను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

**మహిళ అదృశ్యం :** కోవెలకుంట్లలోని స్వామినగర్‌కు చెందిన పుల్లమ్మ అనే వివాహిత అదృశ్యమైనట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఈ మహిళ పిల్లలతో సహా శనివారం ఉదయం నుంచి కనిపించకపోవడంతో భర్త నరసింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సూర్య

ఆదివారం | 19 అక్టోబరు 2025

# క్రీడల సాధన ఆత్మవిశ్వాసం పెంచుతుంది

**:– తైక్వాండో క్రీడాకారులకు బెల్టుల ప్రధానంలో మంత్రి టీజీ భరత్**


క్రీడాకారులకు బహుమతులు ప్రధానం చేస్తున్న మంత్రి టీజీ భరత్

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** తైక్వాండో, కరాటేలాంటి క్రీడల సాధన చేయడం వలన అదనంగా ఆత్మవిశ్వాసం పెరుగుతుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. తైక్వాండో కోచ్ జి షబ్బీర్ ఆద్వర్యంలో శిక్షణ పొందిన క్రీడాకరులకు శనివారం కలర్ బెల్టులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రతిరోజు క్రీడా సాధన చేయడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు. క్రీడల సాధన వలన మరో అవకాశం విద్యా ఉద్యోగాల్లో రిజర్వేషన్ కోటా ఉంటుందని తెలిపారు. అందుకే తల్లిదండ్రులు పిల్లలు ఆరోగ్యంగా ఉండాలన్నా, చదువులో మంచి మార్కులు సాధించాలన్నా క్రీడా సాధన చేయించాలన్నారు. అలాగే భవిష్యత్తులో పిల్లలు బాగా చదివితే కొత్తగా కర్నూలులో ఏర్పాటు చేయబోయే పారిశ్రామిక వాడతో ఉద్యోగాలు పొందే అవకాశం ఉందన్నారు. నా కుమారునికి తైక్వాండో శిక్షణ ఇప్పించాలని కర్నూలులో బెస్ట్ కోచ్ ఎవరని సర్వే చేసినప్పుడు షబ్బీర్ హుస్సేన్ పేరు సూచించారన్నారు. ఆయన భవిష్యత్తులో మరింత ఎక్కువ మందికి శిక్షణ ఇచ్చి కర్నూలుకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం స్కూల్ గేమ్స్ తైక్వాండో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను, కోచ్ షబ్బీర్ హుస్సేన్‌ను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కె పద్మలతా రెడ్డి, సిపిఐ నగర కార్యదర్శి రామకృష్ణా రెడ్డి, ప్రజా శక్తి జనరల్ మేనేజర్ టి నరసింహా, నారాయణ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస రెడ్డి, కార్డియాలజిస్టు ఇందు ప్రకాష్, స్కూల్ గేమ్స్ సెక్రటరీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ నాయకుడి పొలంలో 30 క్వింటాళ్ల పత్తి చోరీ


పత్తి దొంగలించిన పొలంలో విచారణ చేస్తున్న పోలీసులు

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** గోనెగండ్ల మండల టీడీపీ ప్రధాన కార్య దర్శి కున్నూరు రమణ చౌదరి పొలంలో శనివారం తెల్లవారుజాము న గుర్తు తెలియని దొంగలు పత్తి పంటను చోరి చేశారు. శనివారం ఉదయం పొలంలో పత్తి చోరి జరిగినట్లు గుర్తించిన రమణచౌదరి, సుబ్బరాయుడు గోనెగండ్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు చోరి జరిగిన పొలంలోకి వెళ్లి విచారణ చేశారు. పొలం యజమాని రమణ చౌదరి తెలిపిన వివరాల మేరకు రమణ చౌదరి 23 ఎకరాలలో పత్తి సాగు చేశాడు. తాను సాగు చేసిన పొలం గ్రామానికి దగ్గరలో ఉండటం ఇంటి దగ్గర పత్తిని నిలువ చేస్తే ఎర్రపురుగు తో ఇంట్లోని వారికి ఆరోగ్యం దెబ్బతింటుందని తలచి పత్తి నిలువ కోసం పొలంలోనే షేడ్ వేశాడు. ప్రస్తుతం ప్రభుత్వం పత్తిపంటకు మంచి ధర ప్రకటించడంతో నిలువ చేసి ఒకే సారి అమ్మకం జరపాలని తలచాడు. దీంతో ప్రతి రోజు తీసిన పత్తిని షెడ్లోనే నిలువ చేసేవారు. మొదట్లో కేవలం 20 క్వింటాళ్ల పతి ని మాత్రమే అమ్మకం జరిపాడు. ఇక రోజు తీసిని పత్తిని షెడ్లోనే నిలువ చేసేవారు. షెడ్ లో దాదాపు 60 క్వింటాళ్ల వరకు పత్తి నిలువ ఉంది. దీన్ని గుర్తించిన గుర్తు తెలియని దొంగలు పథకం ప్రకారం శనివారం తెల్లవారుజామున బోలేరో వాహనం లో వంద యూరియా బస్తల పత్తిని చోరిచేశారు. బోలేరో వాహనం లో ఎంత పట్టిందో అంత వత్తిని వేస కొని వెళ్లినట్లు తెలుస్తుంది. శనివారం గోనెగండ్ల స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచరణ జరుపుతున్నారు.

# లెదర్ సొసైటీని కాపాడుతాం..!

- దోపిడీని అరికట్టి చర్యలు తీసుకుంటాం
- జీఎం ఇండస్ట్రీస్ వారికి విచారణకు ఆదేశం
- షేర్ హెూల్డర్లకు, దళితులకు న్యాయం చేస్తాం
- ఆకస్మీకంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే బీవీ


సొసైటీ లో ఉన్న లెదర్ ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీవీ

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్:** పద్మశ్రీ మాచాని సోమప్ప గొప్ప ఆశయంతో ఎమ్మిగనూరులో అనేక సొసైటీలను ఏర్పాటు చేశారని, ఇందులో భాగంగానే లెదర్ సొసైటీ కూడా ఒక్కటి ఇందులో జరు గుతున్న దోపిడిని, అక్రమాలను అరికట్టి సొసైటీని కాపాడతానని ఎమ్మెల్యే బీవీ. జయనాగేశ్వర రెడ్డి అన్నారు. శనివారం పట్టణ సమీపంలోని గూడూరు రోడ్డులో ఉన్న లెదర్ సొసైటీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సొసైటీ లో నిలువ ఉన్న లెదర్ ను ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ లెదర్ సొసైటీలో మాజీమంత్రి బీవీ. మోహన్ రెడ్డి హయాంలో దళితులు లెదర్ వస్తువులను తయారు చేసి ఎగుమతి కూడా జరిగే పరిస్థితి ఉండేదన్నారు. గత మూడు రోజుల క్రితం షేర్ హెూల్డర్లు తమకు వినతిపత్రాన్ని అందించారన్నారు. సొసైటీ మూత పడిందనిభావనలో ఉంటేఇక్కడ పరిస్థితి చూస్తే దారుణంగా ఉందన్నారు. యాజమాన్యం ముసుగులో డబ్బులు అర్జిస్తున్నారని, సంబంధం లేని వ్యక్తులను సొసైటీలో పెట్టడం జరిగిందన్నారు. లక్షల విలువ గల లెదర్ స్టాక్ ను ఉంచారన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సొసైటీ మంచి రోజులు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటారన్నారు. షర్ హెూల్డర్లకు, దళిత సామాజిక వర్గానికి పని కల్పించే విధంగా ముందుకు పోతానన్నారు. ఈ విషయంపై జిఎం ఇండస్ట్రీస్‌కు సంబందించిన అధికారులకు విచా రణకు ఆదేశించడం జరిగిందన్నారు. ఇక్కడ జరుగుతున్న దోపిడిని అరికట్టడంతో పాటు వారిపై కూడా చర్యలు తీసుకోవడం జరుగు తుందన్నారు. ఈ సొసైటీ అన్యాక్రాంతులకు గురవుతుందని నా దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. సొసైటీ నెలమట్టం అయింద ని పుకార్లు సృష్టించి చీకటి వ్యాపారం చేసుకోవడంపై ఎమ్మెల్యే మండి పడ్డారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు మల్లెల అల్ఫ్రెడ్ రాజు, పట్టణ అధ్యక్షుడు మాచాని మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# వర్కూరులో యధేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

**కోడుమూరు, మేజర్‌న్యూస్ :** కోడుమూరు మండల పరిధిలోని వర్కూ రు గ్రామంలో హంద్రీ నది నుండి యధేచ్ఛగా ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. హంద్రీ నదిలోకి పదుల సంఖ్యలో ట్రాక్టర్లు దిగి ఇసుకను తరలించుకుపోతున్నారు. హంద్రీనది నుంచి ఇసుకను తరలించకూడదని ఉన్నతాధికారులు ఆదేశించినప్పటి కీ ఇక్కడి ట్రాక్టర్ యజమానులు పెడచెవిన పెట్టి అక్రమంగా ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. హంద్రీ నుండి ఇసుక తరలిపోతుంటే పోలీస్, రెవెన్యూ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు హంద్రీకి కొంత మేర ఇసుక వచ్చింది, వచ్చిన కొంత ఇసుకను కూడా అక్రమార్కులు తరలించుకుపోవడంతో భారీ గొయ్యిలు ఏర్పడ్డాయి. హంద్రీ నదిలో ఇసుక లేకపోతే రాబోయే వేసవి కాలంలో తాగునీటి సమస్య ఏర్పడుతుందని కావున అధికారులు స్పందించి ఇసుక తరలిపోకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు

## విశాఖకు గూగుల్ టెక్ సంస్థ రావడం

# నవ్యాంధ్రప్రదేశ్‌కు శుభపరిణామం


మాట్లాడుతున్న ఎంపీ బైరెడ్డి శబరి

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన గూగుల్ టెక్ సంస్థ విశాఖకు రావడం నవ్యాంధ్రప్రదేశ్‌కు శుభపరిణామని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. శనివారం ఎంపీ మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాత టెక్ దిగ్గజాలతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌లు బేటీ అయి రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకు వచ్చి స్థానిక యువతి, యువకులకు ఉద్యోగ అవకాశాలు సృష్టించి, అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందేలా కృషి చేస్తున్నారని అన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌ల కృషి ఫలితమే రాష్ట్రానికి గూగుల్, టీసీఎస్, అక్సెంచర్ వంటి టెక్ దిగ్గజాలు వస్తున్నాయని అన్నారు. పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన వాతావరణం కల్పించడం, సమర్థవంతమైన నాయకత్వంతోనే సాధ్యమని అన్నారు. విశాఖకు గూగుల్ కంపె నీ రావడంతో యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలు అందనున్నాయని అన్నారు. యువతలో ఆత్మవిశ్వాసం పెంపొందించేలా, వారి అభివృద్ధికి బాటలు వేసేలా, యువతను ఒక బలమైన శక్తిగా మార్చేందుకు ఇటువంటి సంస్థలు రాష్ట్రానికి రావడంతోనే సాధ్యమని అన్నారు.

# 20న ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

**:– కలెక్టర్ డా.ఏ సిరి**

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** దీపావళి పండుగ సందర్భంగా ఈ నెల 20న (సోమవారం) ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేసినట్లు కలెక్టర్ డా.ఏ సిరి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దీపావళి పండుగ సందర్భంగా సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దయిందని ప్రజలు ఈ విషయం గమనించాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# కాలుష్య రహిత కార్యక్రమాలు చేయాలి – ఎంపీడీవో


స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్రలో పాల్గొన్న ఎంపీడీవో, కార్యాలయం సిబ్బంది

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల మూడవ శనివారం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర –స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని జూపాడుబంగ్లా మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో గోపీకృష్ణ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలుష్య రహిత వాతావరణం, మంచి గాలి అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి శుభ్రత, పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వచ్ఛ ఆంధ్ర –స్వర్ణాంధ్రపై ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీవో గోపీకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక రోజు పరిశుభ్రత అనే కార్యక్రమంలో పాల్గొని ముందుకు వెళ్తే అప్పుడు స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర సాధించవచ్చని, దానితో పాటు కాలుష్య రహిత కార్యక్రమాలు చేపడితే పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొనాలని అప్పుడు దేశంలో అన్ని రాష్ట్రాల కంటే మన రాష్ట్ర అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో ఈవోఆర్‌డీ పద్మావతమ్మ, ఎంపీఎం అంబమ్మ, వెలుగు సీసీలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

# బాలికా విద్యతోనే ప్రగతి సాధ్యం – ఎంపిడిఒ


మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీనివాసులు, శ్రీధర్‌రావు

**అవుకుమేజర్,న్యూస్:** బాలికా విద్యతోనే ప్రతి సాధ్యమని ఎంపిడిఒ శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రమైన అవుకు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అంతర్జాతీయ బాలికల దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ఎంపిడిఒ శ్రీనివాసులు, ఎం.ఈ.ఒ శ్రీధర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 8,9,10వ తరగతి విద్యార్థినీలకు బాలల హక్కులు, బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలు, చట్టపరమైన శిక్షలు, హెల్ప్‌లైన్ నెంబర్లు, వ్యక్తిగత శుభ్రత , చదువుకోవడం వల్ల ఉప యోగాలు, సమాజంలో వచ్చే సమస్యలను ఎలా ఎదుర్కోవాలి అనే విషయాల గురించి వివరిం చారు. ఈ కార్యక్రమంలో మల్లేశ్వరీ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జి. పావని, హెడ్‌కానిస్టేబుల్, అంగన్‌వాడి టీచర్స్ తదితరులు పాల్గొన్నారు. పిల్లలకు వ్యాసరచణ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు మొదటి, రెండవ, మూడవ బహుమతులను ఐసిడిఎస్ డిపార్ట్‌మెంట్ వారు అందజేశారు.

# మహానంది క్షేత్రంలో ఘనంగా నందీశ్వర అభిషేకం

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది పుణ్య క్షేత్రంలో శనివారం నందీశ్వర అభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు బ్రహ్మశ్రీ రవిశంకర అవధాని, నాగేశ్వర శర్మ, హనుమంతరాయ శర్మల వేదమంత్రాలతో ప్రదోష నందీశ్వర అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆశ్వీయుజ బహుళ త్రయోదశి, మహా ప్రదోషం సందర్భంగా ఈ నందీశ్వర అభిషేకాన్ని నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం కార్యక్రమాన్ని నిర్వహించి బసవేశ్వరుడికి పంచామృతాలతో అభిషేకించి ప్రత్యేక అలంకారాలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.